క్లుప్తంగా

మోదకొండమ్మ ఆలయానికి బెంచీల వితరణ



అర్చకుడికి నగదు అందజేస్తున్న దాత

మాడుగుల రూరల్: స్థానిక మోదకొండమ్మ ఆలయానికి విశాఖకు చెందిన కె. జయప్రకాశ్ అనే భక్తుడు బెంచీల నిమిత్తం రూ.6 వేలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తం నగదు బుధవారం ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మకు అందించారు. దాతకు అమ్మవారి జ్ఞాపిక బహూకరించారు. నాగమణి, ఎం. కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, కలిమి గోసన్న, గంగిరెడ్ల లింగన్న, గొల్లవిల్లి సత్యారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆధార్ నమోదు సేవలు



విద్యార్థుల వేలిముద్రల నమోదు చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ మౌనిక

కె.కోటపాడు: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల చెంతకే ఆధార్ నమోదు కార్యక్రమాన్ని తీసుకురావడం అభినందనీయమని అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ తెలిపారు. స్థానిక అయ్యన్న కళాశాలలో బుధవారం ఆధార్ అథెంటికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వేలిముద్రల సేకరణతోపాటు ఆధార్‌తో ఫోన్ నంబర్‌ను జతచేసే కార్యక్రమాన్ని స్థానిక సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ మౌనిక నిర్వహించారు.

చురుగ్గా చెరకు సరఫరా



కొత్తమల్లంపేట వద్ద రైతులు తీసుకువచ్చిన చెరుకు

గొలుగొండ: కొత్తమల్లంపేట చెరుకు తూనిక కేంద్రం నుంచి చెరకు సరఫరా చురుగ్గా సాగుతోంది. ఇక్కడ కేంద్రం పరిధిలో చిన్నయ్యపాలెం, లింగంపేట, గొలుగొండ, అమ్మపేట గ్రామాల రైతులు చెరకు సాగు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం చెరకు తూనిక కేంద్రం ప్రారంభం కావడంతో రైతులు చెరకు సరఫరా చేస్తున్నారు. ఇక్కడ 700 ఎకరాల్లో పండిన పంటను గోవాడ చెక్కర కర్మాగారానికి తరలించనున్నారు.

సంక్షేమ పథకాలపై ఆరా

మాడుగుల రూరల్: పొంగలిపాక గ్రామ సచివాలయ పరిధి కింతలిలో బుధవారం సచివాలయ కన్వీనర్లు ప్రచారం చేపట్టారు. ఇటీవల కొత్తగా నియమితులైన జామి మాధవి, బంటు కృష్ణ ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ పింఛను కానుక, అమ్మఒడి, రైతు భరోసా, తదితర సంక్షేమ పథకాలు గురించి వివరించారు. నవరత్నాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. గ్రామ శాఖ అధ్యక్షుడు జామి చిన్న, మాజీ సర్పంచ్ మైచర్ల సత్యంనాయుడు, వేచలపు సహదేవుడు, రమణ, మోహన్, వలంటీర్లు పాల్గొన్నారు.

త్వరితగతిన ఈ- క్రాప్



జానకీరాంపురం ఆర్బీకేను సందర్శించిన ఏవో విజయలక్ష్మి

రోలుగుంట: రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం చేపట్టిన ఈ-క్రాప్, ఈ- కేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామస్థాయి సహాయ వ్యవసాయాధికారులను ఏవో ఎస్.వి జయలక్ష్మి ఆదేశించారు. మండలంలో కుసుర్లపూడి, జానకీరాంపురం ఆర్బీకేలను బుధవారం ఆమె సందర్శించారు. రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. ఈ- క్రాప్ నమోదు, ఈ-కేవైసీ వివరాలపై ఆరా తీశారు. జానకీరాంపురంలో కియోస్కోను తనిఖీ చేశారు. ఈ నెల 15వ తేదీలోపు రైతులు ధాన్యం అమ్ముకునేలా చేయాలని గ్రామస్థాయి సహాయ వ్యవసాయాధికారి శ్యామలకు సూచించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
✆ 9966329167, 9912440601
సాక్షి

రూ.20 కోట్లతో సచివాలయాల భవన నిర్మాణాలు

- గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



డ్వాక్రా మహిళలకు రుణ నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నాతవరం: నర్సీపట్నం నియోజకవర్గంలో రూ. 20 కోట్లుతో 61 గ్రామ సచివాలయాలకు నూతన భవనాలు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తెలిపారు. బుధవారం గన్నవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. డ్వాక్రా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల చెక్కు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలోనే ప్రజలకు అన్ని రకాలు సేవలందించాలన్న ఉద్దేశంతో గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఇంతవరకు నియోజకవర్గంలో 20 పైగా సచివాలయాలు నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించామన్నారు. మిగతావి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. 60 ఆర్బీకేలు, 49 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు నూతన భవనాలు నిర్మిస్తున్నామన్నారు. ఆర్బీకే ఒక్కంటికి రూ.21.80 లక్షలు, హెల్త్ క్లినిక్ భవనం ఒక్కంటికి రూ.20.50 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. నియోజకవర్గంలో ఇంతవరకు 45పైగా సచివాలయాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేశామన్నారు. సచివాలయం ఒక్కంటికి రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, తహసీల్దార్ కనకారావు, పీఆర్ డీఈ ప్రసాద్, జేఈ వెంకటేశ్వరమ్మ, ఇరిగేషన్ హౌసింగ్ జేఈలు జోగారావు, శ్యామ్‌కుమార్, గన్నవరం, పి.కె. గూడెం పర్సన్ ఇన్‌చార్జులు గొర్లె వరహాలబాబు, అచ్చేర్ల వరహాలబాబు, సర్పంచులు బొడ్డు సత్యనారాయణ, మిరపల వెంకటరమణ, మరలపురెడ్డి బాబ్జి, గుడపర్తి అచ్చియ్యనాయుడు, లగుడు నాగేశ్వరరావు, ఎంపీటీసీ తమరాన సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు ఉలబాల శ్రీను, సిద్ధాబత్తుల వెంకటరమణ, ముత్తా శివాజీ, వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి, ఏపీవో చిన్నారావు, వీఆర్వో గణేష్ ఉన్నారు.

నేడు వై.బి.పట్నంలో గడప గడపకు కార్యక్రమం

వై.బి.పట్నంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు అన్నారు. ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ హాజరయ్యే కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు.

సందడిగా నెహ్రూ తీర్థం



నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తీర్థం బుధవారం కె.జె.పురంలో ఘనంగా నిర్వహించారు. మదర్ థెరిసా యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శాలిపేట వీధిలోని నెహ్రూ విగ్రహం వద్ద చిన్నారులతో జాతీయ గీతాలు ఆలపించారు. అనంతరం నెహ్రూ విగ్రహానికి సర్పంచ్ జామి రమణబాబు, కాళ్ల అప్పలనాయుడు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించారు. నాయకులు ఆడారి కన్నారావు, డాక్టర్ కర్రి వెంకటరత్నచారి, విశ్రాంత ఉపాధ్యాయులు కాళ్ల అమ్మతల్లినాయుడు, రాపేట రామకొండలరావు, వేగి గాంధీ, ఆరోగ్య సహాయకుడు పేర్ని శంకర్ పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత



నగదును అందజేస్తున్న ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు

దేవరాపల్లి: తెనుగుపూడి గ్రామానికి చెందిన శిస్తి కళావతికి తక్షణ సాయంగా ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కాటిపాం పెదనాయుడు రూ.10 వేలు బుధవారం అందజేశారు. ఆమె భర్త బైరాగి మరణించడంతో వైఎస్సార్ బీమా పథకం కింద మిగిలిన రూ.90 వేలు నామినీ ఖాతాలో జమ కానుందన్నారు. సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ ఎం.పి. నాయుడు, విశాఖ డెయిరీ పాల సొసైటీ వేతన కార్యదర్శి పెంటకోట శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకుడు భీమిన పోతురాజు, వలంటీర్ పి. అంజలీకుమారి పాల్గొన్నారు.

జీవాలకు పీపీఆర్ వ్యాధి నిరోధక టీకాలు



వి.జె.పురంలో మేకలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది



దిబ్బపాలెంలో టీకాలు వేస్తున్న దృశ్యం

మాడుగుల: గొర్రెలు, మేకలకు ఉచిత పీపీఆర్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు మాడుగుల ఏరియా పశువైద్యశాఖ సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు బుధవారం తెలిపారు. బుధవారం వి.జె.పురంలో 200 మేకలకు, శంకరం పంచాయతీ శివారు కొత్తవలసలో 187 మేకలకు, తాటిపర్తి పంచాయతీ శివారు బిళ్లలుపాలెంలో 145 మేకలకు టీకాలు వేశామన్నారు. మండలంలో ఇంతవరకు 2,156 జీవాలకు పీపీఆర్ వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు పేర్కొన్నారు.

దిబ్బపాలెంలో

చీడికాడ: గొర్రెలకు, మేకలకు పీపీఆర్ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని చీడికాడ పశువైద్యాధికారి జి.గాయిత్రి దేవి తెలిపారు. బుధవారం దిబ్బపాలెంలో జీవాలకు ఉచితంగా పీపీఆర్ వ్యాధి నిరోధక టీకాల వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంతవరకు మండలంలో 1,142 జీవాలకు టీకాలు అందించామన్నారు. ఇంకా టీకాలు వేయించకుంటే సచివాలయం సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

మెరుగైన వైద్య సేవలతో మన్ననలు

- గునుపూడి పీహెచ్‌సీని తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి



వైద్యాధికారులకు సూచనలు చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి

నాతవరం: ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా రోగులు మన్ననలు పొందే విధంగా వైద్య సేవలందించాలని డిప్యూటీ డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.జ్యోతి తెలిపారు. గునుపూడి పీహెచ్‌సీని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఇక్కడకు రోజూ వచ్చే రోగులు సంఖ్య వివరాలను వైద్యాధికారులు ఎం. సురేష్‌కుమార్, వి. పద్మప్రియలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల పీహెచ్‌సీకి హెచ్‌పీసీఎల్ రూ.50 లక్షలతో అందించిన యంత్రాలను పరిశీలించి, రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలన్నారు. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. ఇతర పీహెచ్‌సీలతో పోల్చుకుంటే ఇక్కడ మౌలిక సదుపాయాలతోపాటు ప్రైవేటు ఆస్పత్రిలో మాదిరిగా పరీక్షల యంత్ర సామగ్రి ఉందన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తే ఆశించిన విధంగా రోగులకు వైద్య సేవలు అందించవచ్చున్నారు. ఎంపీహెచ్‌ఈవో సిహెచ్ నాగేశ్వరరావు, పీహెచ్ఎన్ జి. వెంకటలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

120 మందికి నేత్ర పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

మాకవరపాలెం: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక ఉచిత నేత్ర వైద్య శిబిరంలో బుధవారం 120 మందిని విశాఖ శంకర్ ఫౌండేషన్ వైద్యులు పరీక్షించారు. వీరిలో 45 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరిని విశాఖ తరలించి ఆపరేషన్లు చేస్తామని డాక్టర్ సురేష్ తెలిపారు. విజన్ కంటి పరీక్ష కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో క్యాంపు కో ఆర్డినేటర్ పైడిరాజు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడిని ఆదుకోవాలి



కాలిబూడిదైన నాటు కోళ్ల పెంపకం పూరిపాక

ఎస్.రాయవరం : నాటుకోళ్లతో పూరిపాక కాలిబూడిదైన ఘటనలో బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ కర్ర సత్యనారాయణ కోరారు. తిమ్మాపురం శివారు కోనవానిపాలెంలో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైన పూరిపాకను సందర్శించి, బాధితుడు మామిడి తాతాబ్బాయిని పరామర్శించారు. పూరిపాకలో 100కుపైగా నాటు కోళ్లను పెంచుకుంటున్నాడని రాత్రి సమయంలో అగ్నిప్రమాదానికి గురయ్యి పూర్తిగా కాలి బూడిదయ్యిందని అన్నారు. ప్రమాద నష్టాన్ని వీఆర్వో నూకరాజుకి వివరించారు. సుమారు లక్ష రూపాయలు వరకు నష్టం జరిగిందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బొజ్జన్న, వియ్యపు సింహాద్రి, దుర్గబాబు తదితరులు బాధితుడిని పరామర్శించారు.

13న బడ్జెట్ సమావేశం

మాడుగుల: ఎంపీపీ వేమవరపు రామధర్మజ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 13న బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మీనాకుమారి తెలిపారు. 2022-23 సవరణ బడ్జెట్, 2023-24 అంచనా బడ్జెట్‌పై సమావేశం నిర్వహిస్తామన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

నేడు చౌడువాడలో 'గడప గడపకు'

కె.కోటపాడు: చౌడువాడలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శచీదేవి తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొంటారన్నారు.

వేడుకగా ముగిసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవం



ఉత్సవమూర్తులను దర్శించుకుంటున్న భక్తులు

రోలుగుంట: కొండపాలెంలో ఈ నెల 6న ప్రారంభమైన గౌరీపరమేశ్వరుల ఉత్సవం బుధవారం అనుపు వేడుకతో ముగిసింది. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక చెరువులో నిమజ్జనం చేసేందుకు పల్లకిపై తరలిస్తుండగా భక్తులు ఉత్సవమూర్తులను దర్శించుకుని పూజలు చేసి చీర, సారె సమర్పించుకున్నారు. ఈ క్రమంలో మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక చెరువులో అనుపు చేశారు. సర్పంచ్ బంటు లక్ష్మి, ఉప సర్పంచ్ చిరంజీవి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు చిత్తు



విద్యార్థులతో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

నర్సీపట్నం: మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ జి.చిన్నారావు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిసై విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలన్నారు. మాదకద్రవ్యాల క్రయ, విక్రయాలు ఎక్కడైనా జరిగితే పోలీసులకు తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా సాయం



బీమా చెక్కును అందచేస్తున్న సర్పంచ్

చోడవరం రూరల్: ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు వైఎస్సార్ బీమా కొండంత ధీమానిస్తుందని బెన్నవోలు సర్పంచ్ మూడెడ్ల శంకరరావు తెలిపారు. గ్రామానికి చెందిన మజ్జి వెంకటరావు గత నెలలో పరవాడ మండలం ఎల్‌జీ ఫార్మా కంపెనీలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో అతడికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా పది వేల రూపాయల తక్షణ సాయంగా అందజేశారు. ఈ పథకం ద్వారా మృతుని కుటుంబీకులకు ఐదు లక్షల రూపాయల బీమా సాయం అందిస్తారు. మిగిలిన రూ.4.90 లక్షల బుధవారం గ్రామ సచివాలయంలో మృతుని భార్య దేవి, కుటుంబ సభ్యులకు సర్పంచ్ అందజేశారు. గ్రామ సచివాలయ కార్యదర్శి సుస్మిత, వెల్ఫేర్ ఆఫీసర్ నాయుడు, కంఠంరెడ్డి రామారావు, మూడెడ్ల సుధీర్, నిట్ట మారుతీరావు పాల్గొన్నారు.

రోగులు సంతృప్తి చెందేలా వైద్య సేవలు

- కె.కోటపాడు సీహెచ్‌సీని తనిఖీ చేసిన జెడ్పీటీసీ అనురాధ



చిన్నారిని ఎత్తుకుని బాలింతతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ అనురాధ

కె.కోటపాడు: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం ద్వారా మన్ననలను పొందాలని జెడ్పీటీసీ ఈర్లె అనురాధ తెలిపారు. స్థానిక సీహెచ్‌సీని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతోపాటు ప్రసవాలు చేయించుకున్న తల్లులతో మాట్లాడారు. ఇక్కడ అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో మందులను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందిని కోరారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

రక్తహీనత బారిన పడకుండా ఆరోగ్య జాగ్రత్తలు



ఆరోగ్య జాగ్రత్తలను వివరిస్తున్న వైద్య సిబ్బంది

కె.కోటపాడు: కిశోర బాలికలు రక్తహీనత సమస్య లేకుండా వైద్య సిబ్బంది ఆరోగ్య సూచనలను పాటించాలని వైద్యాధికారులు శైలజ, జాహ్నవి సూచించారు. బుధవారం లంకవానిపాలెం పీహెచ్‌సీలో కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ రక్తహీనత సమస్య ఉంటే ఐరన్ మాత్రలు, సిరప్‌ను ఉపయోగించాలని సూచించారు. వీటితోపాటు ఆకుకూరలు, పప్పుదినుసులు, బెల్లంతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. 18 ఏళ్లు నిండకుండానే వివాహాలు చేసుకోవద్దని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాంబాబు మాస్టారుకు ప్రశంసా పత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న రాంబాబు మాస్టారు

రోలుగుంట: నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలోని ఎగ్జిబిషన్‌లో కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల సోషల్ టీచర్ అప్పన రాంబాబు రూపొందించిన గృహ నమూనా ఆకట్టుకుంది. అధికారులు, ప్రజాప్రతినిధుల మన్ననలు పొందిన సుస్థిరాభివృద్ధి గృహం₹₹ ప్రాజెక్టుకు గుర్తింపు లభించడంతోపాటు బుధవారం సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ సహాయ సంచాలకుడు షఫీ మహమ్మద్ ప్రశంసాపత్రం అందజేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, ఐసీడీఎస్ పీడీ ఉషారాణి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగండి.. ఉన్నతంగా ఎదగండి

- సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు



విద్యార్థినుల థింసా నృత్య ప్రదర్శన

చోడవరం రూరల్: విద్యార్థి దశలో క్రమశిక్షణను అలవరచుకుంటే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలను అధిరోహించగలరని చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల 54వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ విద్యార్థులకు చక్కని మార్గదర్శనం చేశారు. చదువున్నంత మాత్రాన క్రమశిక్షణ లోపిస్తే ఫలితం ఉండదన్నారు. క్రమశిక్షణ కలిగిన మేధావి సెల్‌ఫోన్ వంటి ప్రయోజనకరమైనవి కనిపెడితే, అది లేనివాడు వైరస్‌ను కనిపెడతాడని ఉదహరించారు. తల్లిదండ్రులు ఏమీ ఆశించరని, తమ పిల్లల ఉన్నతిని మాత్రమే కోరుకుంటారన్నారు. అందుకు తగినరీతిలో కళాశాల జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దని, వాటికి అలవాటు పడితే జీవితం దుర్భరమవుతుందని, కేసులతో జైలు పాలు కావాల్సి వస్తుందని హెచ్చరించారు. అమ్మాయిల పట్ల ప్రేమ పేరుతో వెంటపడితే అరిటాకు మాదిరిగా చిరిగిపోయేది అబ్బాయిల జీవితమేనని నవ్వులు పూయించారు. చదువునే ఆయుధంగా చేసుకుని ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల పూర్వ విద్యార్థి, జూనియర్ కమాండెంట్ ఆఫీసర్ ఎం.మారునాయుడు మాట్లాడుతూ ఏదైనా క్రీడల పట్ల ఆసక్తి ఉన్న వారు మంచి ప్రతిభ చూపితే ఉద్యోగ సాధన సులభతరమవుతుందని వివరించారు. అందరిలో ఒకరిగా కాకుండా ప్రత్యేకంగా ఎదగాలని కోరారు. ప్రిన్సిపాల్ వి.గోపాలకృష్ణ చేనులు, యూడీసీ సుధాకర్, ఫిజికల్ డైరెక్టర్ జి.రాంబాబు తదితరులు ప్రసంగించారు. అనంతరం విద్యార్థిని బి.సావిత్రి భరత నాట్య ప్రదర్శనతో సాంస్కృతిక ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. విద్యార్థినుల బృందం చేసిన థింసా నృత్యం, విద్యార్థులు చేసిన పలు రకాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రకృతి ఉత్పత్తులతో మెరుగైన ఆరోగ్యం



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అనకాపల్లి రూరల్: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయ విభాగం అనకాపల్లి డివిజన్ మాస్టర్ ట్రైనర్ వర్మ అభిప్రాయపడ్డారు. మండలంలోని సుందరయ్యపేట గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులు, స్థానిక మహిళలకు అవగాహన కల్పించారు. నవధాన్యాల సాగు, 30 రకాల విత్తనాలతో పండించే వివిధ రకాల ఆహార ఉత్పత్తుల గురించి వివరించారు. పురుగు మందుల వినియోగం లేని పంటల సాగు, కిచెన్ గార్డెన్ పెంపకంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. ఏపీసీఎన్ఎఫ్ అనకాపల్లి డివిజన్ సిబ్బంది అప్పలరాజు, రేవతి పాల్గొన్నారు.

నేటి నుంచి కరాటే చాంపియన్ షిప్ పోటీలు

అనకాపల్లిటౌన్: విశాఖ స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ సీఎం కప్-2023 పోటీల ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ బుధవారం పరిశీలించారు. ఈ పోటీలు విశాఖలో నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. వివిధ దేశాల నుంచి అంతర్జాతీయ క్రీడాకారులు హాజరవుతారని ఆయన చెప్పారు.

18, 19 తేదీల్లో హరి భజన సంకీర్తన పోటీలు

రోలుగుంట: మహా శివరాత్రి పురస్కరించుకొని ఈ నెల 18, 19 తేదీల్లో కుసుర్లపూడి రామలింగేశ్వర శివాలయం పాకలపాడు స్వామీజీ ఆశ్రమం వద్ద జిల్లా స్థాయి హరి భజన సంకీర్తన పోటీలు నిర్వహించనున్నట్టు మాజీ సర్పంచ్ గండి సింహాద్రి బుధవారం తెలిపారు. ఈ నెల 18 ఉదయం 9 నుంచి 19వ తేదీ ఉదయం 9 గంటల వరకూ ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.10 వేలు, రూ. 5 వేలు, రూ. 3 వేలు అందిస్తామన్నారు. ప్రతీ బృందానికి రవాణా ఖర్చులు, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9652903163 సంప్రదించాలని కోరారు.

ఫుడ్ కమిటీ ఏర్పాటుకు వినతి

అనకాపల్లిటౌన్: ఆహార సలహా సంఘాలు (ఫుడ్ కమిటీ) ఏర్పాటు చేయాలని నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూదికొండ మాణిక్యాలరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరకులు అందేవని, ప్రస్తుతం రెండు, మూడు సరకులతో సరిపెడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే ఫుడ్ కమిటీలు ఏర్పాటు చేసి పేదల సమస్యలు తెలుసుకోవాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com